# రోడ్ టు వ్రేక్ యార్డ్

సింహప్రసాద్

చలపతిగారు తెల్లన్సురం ఎక్కడానికి సమాయత్తమవుతోంటే పుల్లారావునీ కోటిగాడ్నీ తీసుకొచ్చాడు పంతులు.

వాళ్ళని చూసి పలకరింపుగా నవ్వారు చలపతిగారు. వాళ్ళు చేతులు జోడించి ఆ పైన చేతులు కట్టుకుని వినయంగా నిలబడ్డారు.

"మనవాళ్ళు వచ్చారండి" పంతులన్నాడు.

"నేనింకా చుక్కేసుకోలేదు పంతులూ కన్నిస్తున్నారు" అని బొజ్జ అదిరేలానవ్వి "రుచి చూస్తారేవిటి" అన్నారు వాళ్ళతో.

"ఒద్దండి" మొహమాటపడ్డారిద్దరూ వైట్ హార్స్‌ని చూస్తూ లొట్టలేస్తూనే.

"సిగ్గుపడకండోయ్. బాబుగారిదంతా సోషలిజం పద్ధతి చెరో కాస్త పుచ్చుకోండి తీర్థం" అని వాళ్ళతో అని "నాటు పూటుగా తాగటం తప్ప నీటు తాగెరగర్లండి. అమృతం కొంచెం పొయ్యండి రుచి చూసి తరిస్తారు" అన్నాడు పంతులు చలపతిగార్తో.

రెండు గ్లాసుల్లో విస్కీ పొయ్యగానే వాటిని కోటిగాడికీ పుల్లారావుకీ అందిచ్చాడు పంతులు. వాళ్ళు వద్దంటున్నా వినకుండా వాళ్ళ చేతుల్లో ఇంతింత జీడిపప్పు పోశాడు.

"మరి నీ మాటేమిటి పంతులూ" అని చలపతిగారు కొంటెగా నవ్వేరోలేదో "క్షమించాలి. తమకి తెలీందేవుందీ నేను పక్కా శాఖాహారిని" అని ముక్కుమీద వేలుంచుకున్నాడతడు.

రెండు గుక్కల్లో గ్లాసులు ఖాళీచేసేశారు పుల్లారావూ కోటిగాడూనూ. ఎప్పుడో ఇలాటిలాటి అవకాశాలొచ్చినప్పుడు కొంచెంగా నీటు రుచి చూట్టం తప్ప ఎక్కువగా తాగి ఎరగరేమో ఇద్దరూ చాలా సంతృప్తిపడ్డారు. ఆనందంగా చూశారు ఆయనేం చెప్పినా తలూపడానికి సంసిద్ధమై.

వీళ్ళిద్దరూ పాతపేటలో చెప్పుకోదగ్గ నాయకులు. పుల్లారావు సారా వ్యాపారంనుంచి సాని వ్యాపారందాకా గల సవాలక్ష వ్యాపారాల్లో బ్రోకర్‌గా పనిచేస్తుంటాడు. ఇక కోటిగాడు చిల్లర దొంగలకీ చిన్న రౌడీలకీ గురువులాటోడు. ఇద్దరి నివాసమూ పాతపేటలోని గుడిసెల్లోనే అయినా ఒక్కోసారి తేడా లొచ్చి కలబడ్డా మొత్తాని కెక్కువగా తోడు దొంగల్లా వ్యవహరిస్తూంటారు. అక్కడి యాభై అరవై గుడిసె వాసుల్లోకెల్ల హంగూ ఆదాయమూ గల వాళ్ళవటంచేత చిన్న సైజు నాయకుల్లా చెలామణి అవుతూంటారు. అంచేతే వాళ్ళతో చలపతిగారి కవసరంపడి పిలిపించారు.

మునిసిపల్ ఎన్నికలకింకా రంగం పూర్తిగా సిద్ధంగాకపోయినా దూరదృష్టితో తన వార్డు జనాన్ని ఆకట్టుకోడాని కిప్పట్నుంచీ ప్రయత్నాలు చేస్తున్నారు చలపతిగారు. మాజీ ఛైర్మన్ అయిన చలపతిగారు మామూలు కౌన్సిలర్ సీటుకంత తీవ్రంగా ప్రయత్నించాల్సినపని లేని మాటనిజమే అయినా ఛైర్మన్ అయ్యాక పేదసాదలకి తను చేసిందేమీలేని దృష్ట్యానూ తమ పార్టీలోని వేరే ముఠా వాళ్ళు తను ఛైర్మన్ కాకుండా తీవ్రంగా ప్రయత్నిస్తున్న దృష్ట్యానూ ఆ మధ్య కొన్నాళ్ళు కేంద్రంలో అధికారంలో వున్న పార్టీలోకి ఓ గంతువేసొచ్చి కొంత అప్రతిష్ట మూటకట్టుకొన్న దృష్ట్యానూ తప్పడంలేదు.

తను కౌన్సిలర్‌గా ఎన్నికైతే మిగలా కౌన్సిలర్లని కొనెయ్యగలసత్తా అందుకు సహాయపడే పెద్దల అండా వున్నందున ఆ మొదటిదశకి అత్యధిక ప్రాముఖ్యత నిస్తున్నారాయన. పైగా కుర్రకారు ప్రవేశిస్తోన్నందున పోటీతీవ్రంగా వుండేట్లుంది కూడా.

**గుడిసెలున్న వంక తేరపారి చూశారు చలపతిగారు. మంత్రిగారు చెప్పింది అక్షరాలా నిజమన్పించింది. పైగా అది మునిసిపాలిటీ స్థలం గనక చవగ్గా కొట్టెయొచ్చు. కాని చిక్కల్లా వీళ్ళని ఖాళీ చేయించడమే!**

"అయ్యా" తమరి మాటకోసం చూస్తున్నారు" పంతులన్నాడు

"వాళ్ళకి తెలీందేవుందీ" అంటూ సమ్మోహనాస్త్రం లాంటి ఓ నవ్వు వాళ్ళమీద పే అన్నారు చలపతిగారు "నా గురించి మీ మీ గురించి నాకూ బాగా తెలుసుకదా. మునిసిపాలిటీ ఎన్నికలొస్తున్నాయి గనుక మీరు నా ప్రక్కనుంటే మీకూ మంచిది నాకూ మంచిది"

"మేమెప్పుడూ మీ పార్టీయేనండి కానీ..." బుర్రగోక్కున్నాడు పుల్లారావు.

"కానీలుపోయి చాలా కాలమయ్యిందోయ్. పైసలు సంగతంటారా ఆ విషయంలో అయ్యగారి చేతికెప్పుడూ ఎముక వుండదు"

"మావోడేదో నోరు జారేడు కానండి అలాగేనండి. మా కష్టం తమకి తెలీంది కాదుగా" కోటిగాడన్నాడు ఒకడుగు ముందుకేసి.

కృష్ణ భగవానుళ్ళా నవ్వారు చలపతిగారు.

"అయ్యగారు పచ్చజెండా వూపేశారోయ్, ఇక మీరు గోదాలోకి దిగటమే ఆలస్యం. మన గుడిసెల్లోని ఒక్క ఓటుకూడా బేరుపోకూడదు" అన్నాడు పంతులు.

"పోనివ్వమనుకోండీ. కాని జనం తెలివి మీరతన్నారండి. రిక్షా సత్తిగాడు చలపతిగారు మనకేం చేశారని ఎగుర్తున్నాడండి పబ్లిగ్గా"

ఆముదం తాగినట్లు మొఖంపెట్టాడు పంతులు.

కొన్ని క్షణాలపాటు సీరియస్‌గా ఆలోచించి అన్నారు చలపతిగారు "అయితే ఏం చేద్దామంటారు?"

"ఏదో సిన్న పని...గుడిసెల జాగాలకి పట్టాలిప్పిస్తే..."

వులిక్కిపడ్డా రాయన. "పదవిలో వుంటే అలాగే ఇప్పిద్దుంగానిప్పుడెలా కుదుర్తుందిరా"

వాళ్ళు దిక్కులు చూశారు.

వూరికో ప్రక్కన రోగంరొచ్చూ దోమలూ పందులూ అనారోగ్యం అజ్ఞానం కుప్పలుగా పేరుకున్నట్టుండే. గుడిసెలాయిన కళ్ళముందు మెదిలాయ్. ఆకలీ దారిద్ర్యం చలీజబ్బూ నీరసం నిరుద్యోగం మూర్తీభవించినట్టుండే గుడిసెవాసులు కళ్ళముందు కదిలారు.

వాళ్ళ మెప్పు పొందటాని కిప్పుడు అర్జంటుగా ఏం చెయ్యగలడు?

గబగబా ఆలోచించారు చలపతిగారు.

మెదళ్లో ఆలోచన మెరిసింది. మొఖం విప్పారింది

"మీ గుడిసెల ముందునుంచి వెళ్ళే మట్టి రోడ్డుమీద కంకర వేయిస్తాను"

"స్మశానానికెళ్ళే రోడ్డాండీ"

"వూఁ-అదే. ఆ రోడ్డువేయిస్తే శ్మశానాని కెళ్ళడానికీ రావడానికీ బావుంటుంది. మీ వాళ్ళకి కొన్నాళ్ళు పనీ దొరుకుతుంది. ఏమంటారు?"

"బ్రహ్మాండమైన ఆలోచన ఒక దెబ్బకి రెండు పిట్టలు" అని వ్యాఖ్యానించాడు పంతులు.

"పని దొరుకుద్ది గనుక మా వోళ్ళు సంతో సిత్తారండి" కోటిగాడన్నాడు

"అయితే రేపే ఆ ఏర్పాట్లలో దిగుతాను" అన్నారు అప్పుడే సగం విజయం సాధించినట్టు ఫీలవుతూ.

ఆ మర్నాడే మునిసిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ని కలిసి పాతపేటలో అలగా జనముండే గుడిసెల ముందు నుంచి శ్మశానానికెళ్ళే రోడ్డు మీద కంకర పరిపించమని గట్టిగాకోరారు. చలపతిగారి బలం బలగం తెలిసినవాడు గనుక మునిసిపాలిటీలో ఫండ్స్ పేరుకుని వున్నాయి గనుక తన అధికారం అంత్యదశలో వున్నందున ఏదో మరి కాస్త తిందామనుకున్నాడు గనుక వెంటనే అంగీకరించేశాడాయన.


టెండర్లు పిలవడం కాంట్రాక్టు ఇవ్వడం పని ప్రారంభమవ్వడం చకచకా జరిగిపోయాయి.

మట్టిరోడ్డు కంకర్రాళ్ళరోడ్డు (దాన్ని కంక్రోడ్డు అనకూడదు)గా మార్పు చెందుతోంటే ఎన్నికలొచ్చాయి.

పాతపేట జనంకోసం ముఖ్యంగా గుడిసెవాసుల సౌకర్యార్థం ఆ రోడ్డుని చలపతిగారు వేయిస్తున్నారనీ ఆయన్ని గెలిపిస్తే తాము నివసిస్తోన్న స్థలానికి పట్టాలిప్పిస్తారనీ చక్కని ఇళ్ళు కట్టుకోడానికి అప్పులిస్తారనీ తమ బ్రతుకుల్ని బాగు చేస్తారనీ గొప్పగా ప్రచారంచేసి గుడిసెవాసుల్ని ఆకట్టుకున్నారు. కులం పేరూ డబ్బు పేరూ చెప్పి మరికొందరు ఓటర్లని తమవైపు త్రిప్పుకున్నారు.

అంతా ఆశించినట్టుగానే చలపతిరావుగారు కౌన్సిలర్‌గా స్వల్ప మెజార్టీతో అయితేనేం ఎన్నికయ్యారు. తనే మంత్రిగారి ముఠాలో వున్నాడో ఆ మంత్రిగారే చైర్మన్ ఎన్నికల పరిశీలకుడిగా రావడంతో చైర్మన్ పదవి చలపతిగార్ని వరించక తప్పలేదు.

అతిశయించిన ఆనందోత్సాహాలతో మంత్రిగారికి పెద్ద పార్టీ ఇచ్చి పాతపేటనుంచి శ్మశానం వరకూ తను వేయించిన కంకరాళ్ళ రోడ్డుకి ఆయనచేతే ప్రారంభోత్సవం చేయించారు చలపతిగారు.



ఆ సందర్భంగా ఏర్పాటైన సభలో 'మేం ఏం చేసినా సామాన్య ప్రజలకోసమే చేస్తున్నామనడానికి ఈ రోడ్డు ఓ నిదర్శనం. ఎవరైనా చనిపోయినప్పుడు ముఖ్యంగా వర్షాకాలాల్లో శవాలని శ్మశానికి తీసుకెళ్ళడానికి ప్రజలు ఎంతో ఇబ్బందిపడుతున్నారు. ఇదిగో ఈ కారణం వల్లే కొందరు జనులు తమ ప్రియ బంధువుల శవాలకి శ్మశానం దాకా వెళ్ళి వీడ్కోలు చెప్పలేకపోతున్నారు. ఇవన్నీ గమనించిన మీ నాయకుడు చలపతిగారీ రోడ్డు వేయించారు. ఇంతటితో అయిపోలేదు. ఇది ఆయన చెయ్యబోయే ఎన్నెన్నో మంచి కార్యాలకి ప్రారంభం మాత్రమేనని మనవి చేస్తున్నాను" అంటూ వుపన్యసించేక 'ఆ మధ్య బాయిల్డ్ రైస్‌మిల్లు కడతానన్నావుగా. ఈ గుడిసెల్ని ఖాళీ చేయించిక్కడ కడితే చాలా బావుంటుంది' అని చలపతిగారి చెవిలో వూదారు మంత్రిగారు.

గుడిసెలున్న వంక తేరపారి చూశారు చలపతిగారు. మంత్రిగారు చెప్పింది అక్షరాలా నిజమనిపించింది. పైగా అది మునిసిపాలిటీ స్థలం గనక చవగ్గా కొట్టేయొచ్చు కాని చిక్కల్లా వీళ్ళని ఖాళీ చేయించడంలోనే వుందనిపించి ఆ మాటే అన్నారాయన్తో.

"దాన్దేముందీ ఇంకోచోట జాగా లిప్పిస్తేసరి" నవ్వేరాయన.

మహదానంత పడిపోయారు చలపతిగారు.

"మన మంత్రిగారు అసాధ్యుడోయ్" అంటూ ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాన్ని చెప్పేరు పంతులుకి.

"ఆ ప్రాంతంలో మిల్లు కడితే బావుండేమాట నిజమే ననుకోండి కానీ... చాలామంది ఓట్లేస్తామని చెప్పి మరీ మోసంచేసినా ఆ గుడిసెల వాళ్లు మోసం చెయ్యలేదు నిజం చెప్పాలంటే వాళ్ళ వల్లే మనం గెల్చేం. అలాటి వాళ్ళనక్కడ్నుంచి తరిమెయ్యడం పాపమండీ" జాలి పడ్డాడతడు.

"పంతులూ! రాజకీయాల్లో పాపపుణ్యాలకీ మంచి చెడ్డలకీ నీతి అవినీతులకీ స్థానం లేదోయ్. ఏం చేసినా ఎలా చేసినా సరే మనం గెలవాలి. మనం పదవుల్లో వుండాలి. మనమూ మనవాళ్ళూ బాగుపడాలి అంతే. అయినా మనం మరీ అన్యాయం చెయ్యటం లేదులే. ఇంకో జాగా చూపిస్తున్నాంగా.

"అయినా వాళ్ళక్కడ్నుంచి కదుల్తారంటారా అని?"

"కదలరు. కాని మనం కదల్చాలి. ఎలా కదుల్చుస్తామో నువ్వే చూస్తావుగా" అన్నారు.

ఆ రోజు రాత్రి పుల్లారావునీ కోటిగాడ్నీ పిలిచి చెరో పదిరూపాయల కట్టా ఇచ్చారు. వాళ్ళాయన చెప్పింది విని తలకాయలూపి వెళ్ళిపోయారు.

మరి నాల్రోజులు గడిచేక ఓ రోజున పుల్లారావూ కోటిగాడూ గుడిసెల్లో కాపురముంటోన్న ఓ పదిమంది తలనెరిసిన వాళ్ళని గట్టిగా మాట్లాడే వాళ్ళనీ వెంటేసుకు నొచ్చారు చలపతిగారింటికి.

"ఏవిటంతా నా మీదకి దండయాత్ర కొచ్చినట్టున్నారూ" చలపతిగారన్నారు ఏమీ ఎరగనట్టు

"తమరు మాకు పట్టాలిప్పిస్తామన్నారు కదండీ అదడుగుదామనొచ్చామండి" పుల్లారావన్నాడు ముందుకొచ్చి.

"తవరెంటనే మాకు పట్టాలూ ఇళ్లు కట్టుకోడానికి అప్పు ఇప్పించాలి" కోటిగాడన్నాడు గట్టిగా.

మిగతా వాళ్లుకూడా ఇప్పించా లిప్పించాలంటూ అరిచారు.

"నా మాటకూడా కొంచెం వినండి. మీరుంటోన్న స్థలాలకి పట్టాలివ్వడానికి నేను తీవ్రంగా ప్రయత్నించానుగాని లాభం లేకపోయింది. ఆ ప్రాంతం ఆరోగ్య దృష్ట్యా నివాసయోగ్యం కాదనీ చెత్తకుప్పల్ని అక్కడవేస్తే బావుంటుందనీ అభిప్రాయ పడుతున్నారు అధికార్లు. ఒకవేళ ఎలా వోలా మీకు స్థలాలిప్పించినా అక్కడ రోడ్లూ లైట్లూ వేయించడానికి వీల్లేకుండా వుంది పరిస్థితి. అంచేత మీరేమీ అనుకోనంటే అక్కడ్నుంచి వేరేచోటి కెళ్ళడానికి ఇష్టపడితే నేనోమాట చెబుతాను" ఆగి వాళ్ళ మొఖాల్లోకి పరిశీలనగా చూస్తూ అన్నారు.

"మేం అక్కడ్నుంచి కదలం" పుల్లారావు అరిచాడు.

"ఆరేం సెబుతారో ఇనకుండా అరుస్తావేంట్రా" కోటిగాడు కోప్పడ్డాడు.

వాళ్ళిద్దరూ క్రిందా మీదా పడుతోంటే మిగతా వాళ్ళు సర్దిచెప్పి చలపతిగారేం చెబుతారో విందామన్నారు.





దండలు

ఓ హత్యకేసులో అనుమానించి చలమయ్యను అరెస్టుచేశారు పోలీసులు.

"నువ్వేం చేస్తుంటావు?" అడిగాడు లాయర్.

"మా యజమాని చూపించిన వాళ్ళ ఫొటోలకు దండలేస్తూంటాను" అన్నాడు చలమయ్య.

—జి. వి. ఎమ్. ఫణిప్రసాద్ (గోదావరిఖని)



"మన వూరికి తూర్పువైపున అనంతయ్యగారి ఖాళీ స్థలంవుంది. మీరు దాన్ని ఆక్రమించుకుంటే నెలరోజుల్లో పట్టాలిప్పించడమే కాదు మీకు ప్రభుత్వం చేత ప్రత్యేకంగా ఇళ్లుకూడా కట్టింప జేస్తాను"

జనంలో కలకలం లేచింది

ఎలా కుదుర్తుందెలా కుదుర్తుందన్నారు. అనంతయ్యగారు రానివ్వరన్నారు. ఆ కట్టించే ఇళ్ళేవో ఇక్కడే కట్టించమన్నారు. తమని ఇబ్బందిపాలు చెయ్యొద్దని బ్రతిమాలారు. అలా చేస్తే ఆయన మేలు జన్మలో మర్చిపోలేమన్నారు.

అందరి మాటలూ ఆర్గ్యుమెంట్లూ విన్నాక నోరు విప్పారు చలపతిగారు.

"ఎప్పట్నుంచో గుడిసె లేసుకుని వుంటోన్న ఆ స్థలాన్ని వదలటం మీకొంచెం కష్టమైన పని అని తెలుసు. అయినా మీ మేలు కోరి చెబుతున్నాను. అనంతయ్యగారి స్థలమైతేనే అన్ని విధాలా బావుంటుంది. మీరో రాత్రివేళ గుట్టు చప్పుడు కాకుండా వెళ్ళి ఆక్రమించుకుని గాంధీ నగర్ అని ఓ బోర్డు పెట్టుకోండి చాలు. అనంతయ్యగార్నుండి ఎలాంటి అడ్డంకీ రాకుండా నేను చూసుకుంటాను. అంటే ఆ స్థలం ఖరీదు ఆయన కిప్పించేసి మీ కక్కడ ఇళ్లు కట్టిస్తాను. ఇటు మీకూ బావుంటుంది అటు ఆయనకీ బావుంటుంది. కానో సంగతి. ఇప్పుడు పాతపేటలోని గుడిసెల్లో వుంటున్న వాళ్ళే అక్కడికి వెళ్ళాలి. కొత్త వాళ్ళని రానివ్వకుండా గొడవల్లేకుండా మీరంతా ఆ భూమిని సమంగా పంచుకోవాలి"

భేష్, బావుంది అని మెచ్చుకున్నారంతా.

"ఇక మీదే ఆలస్యం" అని ఆయనన్నాక లోలోపల గుంపు చింపులు పడుతున్నా పైకి తలూపి వెళ్ళిపోయారంతా.

ఆ రాత్రి పుల్లారావూ కోటిగాళ్ళ ఆధ్వర్యంలో గుడిసెవాసులు సమావేశమై మళ్ళీ చర్చించారు.

అనంతయ్యగారికి డబ్బిచ్చి ఆ స్థలాన్ని కొని తమకి వుచితంగా పంచుతోన్నట్టవుతోంది గనుక అక్కడైతే ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుంది గనుక వెళ్ళి ఆ స్థలాన్నాక్రమించుకోంటెనే మంచి దన్న నిర్ణయానికొచ్చేశారంతా.

ఇంకో రోజు కూడా వృధా చెయ్యకుండా ఆ మరునటిరోజునే ఆడామగా పిల్లాపీచూ గొడ్డూ గోదా అంతా తమతమ గుడిసెల్ని ఖాళీచేసి కప్పుల్ని కూలగొట్టి కర్రాబుర్రా ఆకూ అలమూ తట్టా బుట్టా నెత్తి నెట్టుకువెళ్ళి అనంతయ్యగారి స్థలాన్నాక్రమించారు. తలో చోటా లిష్ఠవేసి హద్దులు ఏర్పరచుకున్నారు.

మరి మూ్డోజులకి హైదరాబాదు నుంచి వచ్చిన అనంతయ్యగారు జరిగిన సంగతి విని గుండెలు బాదుకున్నారు. తనూ చలపతిగారూ ఒకేపార్టీ వాళ్లైనా రెండు ముఠాలకి చెందిన వాళ్ళవడంవల్ల తనని దెబ్బ తియ్యడానికాయనీ ఎత్తు వేశాడని గ్రహించి పోలీసుల్నా శయించారు.

కానెవ్వరూ బెదర్లేదు. పైపెచ్చు పుల్లారావు నాయకత్వంలో అంతా వూరేగింపుగా వెళ్ళి సబ్ కలెక్టర్ని కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయన వాళ్ళని శాంతింపచేసి విషయాన్ని పరిశీలిస్తానని హామీ ఇచ్చి పోలీసులకి వెనుదిరిగి రమ్మని ఆదేశాలిచ్చారు.

జనం హర్షధ్వానాలు చేశారు.

అనంతయ్యగారు లబోదిబో మంటూ తమ ముఠా పెద్దల సాయాన్నర్థించారు. వాళ్ళూ చలపతిగారి ముఠా పెద్దలూ కలిసి చర్చించి మునిసిపాల్టీ రాజకీయాల్లో చలపతిగారికి అనంతయ్యగారు అడ్డు రాకుండా వుండేట్లూ కూలి నాలి జనం అనంతయ్యగారి స్థలాన్ని ఖాళీ చెయ్యడానికి చలపతిగారు కృషిచేసేట్లూ ఒప్పించి రాజీ కుదర్చారు.

ఫలితంగా అక్రమంగా ఆక్రమించుకున్న స్థలాన్నుంచి వెంటనే ఖాళీ చెయ్యమని కోర్టునుంచి వుత్తర్వురాగా జనాన్ని తీసుకుని చలపతిగారింటి కెళ్ళారు కోటిగాడూ పుల్లారావూ.

అంతా విని ఎంతో బాధపడుతున్నట్టు మొఖం పెట్టి "ఏంచేతో మీకేం సాయం చేద్దామన్నా ఎదురు తిరుగుతోంది. ఇకపోతే న్యాయస్థానం వుత్తర్వుని సమానం అతిక్రమించకూడదు. మీరా స్థలాన్ని ఖాళీ చెయ్యకతప్పదు" అన్నారు

లబోదిబో మన్నారు జనం.

మీరే రక్షించాలంటూ అంతా వేడుకోగా కరుణించినట్లు ఫోజు పెట్టి అన్నారు "మిమ్మిల్నిలా గాల్లో వదలెయ్యను. శ్మశానం ప్రక్కనున్న స్థలం బాగానే వుంటుంది. తుమ్మలూ పొదలూ కొట్టేసి చదునుచేసుకుంటే వూరికి పెద్ద దూరం కూడా అవ్వదు. పైగా అక్కడైతే పట్టాలు త్వరగా ఇప్పించే పూచీ నాది. మీరేం ఆలోచించకుండా అక్కడికి పదండి"

"ఆహాహాహా, ధర్మ ప్రభువులు" అంటూ చేతులు జోడించారు ముందే కడుపునిండిన పుల్లారావూ కోటిగాడూ.

కాని కొందరు ఎదురు తిరిగారు. ఏది ఏమైనా సరే అనంతయ్యగారి జాగానుంచి ఖాళీ చెయ్యమన్నారు. కాని అనంతయ్యగారు పోలీసుల్తో కోర్టు వుత్తర్వుతో సిద్ధమయ్యేసరికి ఖాళీ చెయ్యక తప్పింది కాదు.

కాని పాతపేటలోని దృశ్యం చూసి శిలాప్రతిమల్లా నిలుచుండిపోయారు.

ఇదివరకు తామున్న స్థలం చుట్టూ సిమ్మెంటు స్తంభాలూ ఇనుప ముళ్ళ కంచెలూ వున్నాయ్. కంచె ప్రక్కన అక్కడక్కడా జమాజెట్టీల్లాంటి రౌడీలు సాయుధులై నిలబడ్డారు. ఓ చోట" ఈ స్థలం మునిసిపాలిటీ వారిచే కొందరు వ్యక్తులకి అమ్మబడినది" అన్న బోర్డు గర్వంగా నిలబడి వుంది!

అంతా ఆశ్చర్యంతో కళ్ళప్పగించి చూశారు.

ఆందోళన చెందారు.

ఆవేశ పడ్డారు.

ఆ పైన నిస్సహాయంగా చూశారు.

మరి గత్యంతరం లేదని గ్రహించి మెల్లగా శ్మశానానికెళ్ళే కంకర్రోడ్డు ఎక్కారు ఒకప్పటి గుడిసెవాసులు.

ఈ కొద్ది రోజుల్లో ఈ స్థలం రూపురేఖ లెందుకింతగా మారిపోయాయో తమ బ్రతుకు లెందుకిలా రోడ్డు మీద పడ్డాయో వాళ్ళ కర్థం కాలేదు.

కాని-

వాళ్ళలో ఆలోచన రగలసాగింది! *

